

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రేణిగుంట

గాజులమండ్యం పొలాల్లో ఈక్రాప్ చేస్తున్న వ్యవసాయ సహాయకుల నమోదు కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ప్రతి రైతూ ఈ క్రాప్ చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం అందించేందుకు వీలవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పండించిన రైతు ధనంజయరెడ్డి పొలాన్ని సందర్శించారు. వరి పంటకు తగిన మద్దతు ధర అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు , మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

జీడీనెల్లూరును 'కంచుకోట'గా మారుస్తా

స్టాల్స్ పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు

'సామాజిక పింఛన్ల' పంపిణీలో చంద్రబాబు
నేను రుణపడేది టిడిపికార్యకర్తలకే...
2వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం, జీడీనెల్లూరు

'కార్యకర్తలు శ్రమించడంతో జీడీనెల్లూరులో టిడిపి జెండా 30 ఏళ్ల తరువాత ఎగిరింది.. ఇక కంచుకోటగా మారుస్తా.. కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం.. ఎనిమిది నెలలుగా పాలనలో బిజీగా ఉండడంతో మిమ్మల్ని కలవలేకపోయాను.. ఇకపై ఏ కార్యక్రమానికి వెళ్లినా కార్యకర్తలతో ఖచ్చితంగా మాట్లాడతాను..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. 'సామాజిక పింఛన్ల' పంపిణీలో భాగంగా గంగాధరనెల్లూరుకు విచ్చేసిన ఆయన పింఛన్ల పంపిణీ, పేదల సేవలో కార్యక్రమం అనంతరం కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఎన్ని పనులున్నా వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలను కలవడం బాధ్యతగా పెట్టుకుంటానన్నారు. వైసిపికి ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లేననే విషయాన్ని నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఐదేళ్లపాటు ప్రజలు, కార్యకర్తలు నరకం చూశారని, శనివారం వస్తే ఎక్కడ ప్రొక్లెయిన్ వస్తుందో, ఏ నాయకుని అరెస్టు చేస్తారో తెలియదన్నారు. తాను రుణపడి ఉండేది పార్టీ కార్యకర్తలకేనన్నారు. ఇకపై తనకు, కార్యకర్తలకు మధ్య దూరం ఉండదన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంఎల్ఎ, ఎంపిల గురించి కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటానన్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలన్నారు. తన దృష్టిలో మాటలు చెప్పేవారు కాదని, ఓట్లు సంపాదించేవారే అసలైన విజేతలన్నారు. తనను పొగిడితే వచ్చేదేమీ లేదని, మంచి పనులు చేస్తే మళ్లీ మన ప్రభుత్వం వస్తుందన్నారు. కార్యకర్తలకు గౌరవం ఇవ్వడమే కాదని, అవసరమైతే కొరడా తీసుకుంటానన్నారు. మారకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. ఎంఎల్ఎ విఎం థామస్ మాట్లాడుతూ విజనరీ నాయకుడు చంద్రబాబు అన్నారు.

ప్రతినెలా ఒకటో తేదీ పింఛన్ అందిస్తున్నారని, సెలవు ఉన్న రోజులైతే ఒకరోజు ముందే ఇస్తున్నా రన్నారు. నియోజకవర్గంలో పేదలు, చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారని, మామిడి, చెరకు సాగుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. తచ్చూరు హైవే సమీపంలో ఉండటం వల్ల పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందని, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలన్నారు. గంగాధరనెల్లూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని కోరారు. వెదురుకుప్పం, పాలసముద్రం, కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో ఆస్పత్రి భవనాలను పూర్తి చేయాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. కృష్ణాపురం, ఎన్టీఆర్ జలాశయాలను అనుసంధానం చేసి తాగునీరు, సాగునీరు అందించాలని సిఎంకు విన్నవించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్ ప్లాన్‌తో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామన్నారు.

నియోజకవర్గానికి సిఎం వరాలజల్లు

- నియోజకవర్గంలో రెండువేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తాం.
- బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తాం.
- పెనుమూరు మండలం కల్వకుంట దగ్గర ఎన్టీఆర్ జలాశం నుంచి కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయం వరకూ అనుసంధానం చేసి సమీపంలోనిచెరువులకు నీళ్లు నింపే ప్రయత్నం చేస్తాను.

'ప్రజావేదిక'లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖచే ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. రూ.30.50 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ద్వారా ముఖ్యమంత్రి ఫొటోను సిద్ధం చేసిన జీడీనెల్లూరు మండలం మారేడుపల్లికి చెందిన అమృతను సిఎం అభినందించారు. సంక్షేమ శాఖ ద్వారా 20 మంది వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు, రూ.1.45 లక్షలతో రెండు స్కూటర్లు పంపిణీ చేశారు. 704 మంది లబ్ధిదారులకు బిందు తుంపర్ల సేద్యం పరికరాలను అందజేశారు. ఎంఎల్ఎ నిధులతో ఎనిమిది ఆటోలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ సీఎంకు స్వామి వారి ప్రసాదాలు

చిత్తూరు జిల్లా జి డి నెల్లూరు పర్యటన నిమిత్తం రేణిగుంట ఎయిర్పోర్ట్ కు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడుయిఅ సాదర స్వాగతం పలుకుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రసాదాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అందించారు. శ్రీకాళహస్తి జనసేన, బిజెపి ఇన్‌ఛార్జిలు వినూత కోట, కోలా ఆనంద్ ఉన్నారు.

రక్షిత, హేమశ్రీ బాధ్యత 'కూటమి'దే..

బీసీ కాలనీలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు లేని బాలికలు రక్షిత (10), హేమశ్రీ (8) ఐదు, మూడో తరగతి గంగాధరనెల్లూరు హైస్కూల్లో చదువుతున్నారు. కార్యకర్తల ద్వారా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈ బాలికల సమాచారాన్ని చేరవేశారు. సిఎం దృష్టికి తీసుకెళ్లగా రక్షిత, హేమశ్రీ బాధ్యత కూటమి ప్రభుత్వమే భరిస్తుందన్నారు. పెన్షన్ లబ్ధిదారుని భార్య సెల్వీ మాట్లాడుతూ తన మనవరాళ్లను చదివించాలని, తమకు సొంత ఇల్లు లేదని, జీవనోపాధి నిమిత్తం ఆవుల పెంపకానికి ఆర్థిక సాయం చేయాలని విన్నవించుకున్నారు సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పదించారు. మిషన్ వాత్సల్య పథకం కింద ఒక్కొక్కరికి ప్రతినెలా 4వేల చొప్పున ఇద్దరు ఆడపిల్లలకు మొత్తం ఎనిమిదివేలు బ్యాంకులో జమ చేస్తామని భరోసా ఇచ్చారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఇంటర్ విద్యార్థుల సందడి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ, కలెక్టర్
మొదటి రోజు 820 మంది గైర్హాజర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. సరిగ్గా తొమ్మిది గంటలకు ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 9 గంటల పైన నిమిషం ఆలస్యమైనా పరీక్ష గదిలోకి అనుమతించమని అధికారులు ముందే ప్రకటించడంతో విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా 820 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 33,164 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 32,344 విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు. మిగిలిన 820 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఒ తెలిపారు. తిరుపతి రూరల్ వేదాంతపురం పంచాయతీ పరిధిలోని శ్రీనివాస జూనియర్ కళాశాలను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పలు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. పరీక్ష ముగిసాక ఎగ్జామ్ పేపర్లు సంబంధిత కేంద్రాలకు వెళ్లేవరకూ పహారా ఉండాలని ఆదేశించారు.

తిరుపతి రూరల్ పరిధిలో కలెక్టర్ తనిఖీలు

- దొరవారిసత్రంలో... పక్కాగా పరీక్షల్లో విధులు నిర్వహించాలని డిఎస్‌పి చెంచుబాబు ఆదేశించారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పరీక్షా కేంద్రాన్ని నాయుడుపేట పోలీస్ డివిజన్ డీఎస్పీ చెంచు బాబు, ఎస్సై అజయ్ కుమార్ ప్రిన్సిపాల్ తిరుపతయ్యతో కలిసి పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

- బిఎన్ కండ్రిగలో... జూనియర్ కాలేజీ విద్యార్థులు గురువుకు పాదాభివందనం చేసి పరీక్షకు వెళ్లారు. వీరంతా వరదయ్యపాలెం జూనియర్ కాలేజీకి పరీక్ష రాయడానికి వెళ్లాల్సి ఉంది. సమయానికి బస్సులు రాకపోవడంతో ఒక్కో ఆటోలో 20 మంది వరకూ సర్దుకుని వెళ్లారు. రాబోయే విద్యా సంవత్సరానికి బాలురకు, బాలికలకు జూనియర్ కాలేజీలోనే సెంటర్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-గూడూరు టౌన్‌లో.. ఐదు కేంద్రాల్లోనూ మొత్తం 1221 మందికి గాను 1182 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు. డిఎస్‌పి గీతకుమారి బందోబస్తు ఏర్పాటు చేశారు.


దంపతులకు ఆలయం తరపున తాళిబొట్టు, దుస్తులు ఇస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు

ఆది దంపతుల 'కల్యాణ వైభోగం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆదిదంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం వేకువ జామున 4.15గంటల ప్రాంతంలో జ్ఞానప్రసూనాంబ దేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగల్యధారణ పూర్తయింది. ఇదే శుభ ఘడియలో ఆది దంపతుల సమక్షంలో పలువురు జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం వేకువ జామున ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం వీక్షించడానికి పట్టణ వాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వారు వేలాదిగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా వివాహం చేసుకున్న వారికి ఆలయం తరపున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు మంగళ సూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. పార్వతీదేవికి మాంగల్యధారణ చేసిన ఘడియలోనే ఈ జంటలు మాంగల్య ధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఆది దంపతుల కల్యాణం సందర్భంగా ఈ ఏడాది 44 జంటలు వివాహం చేసుకున్నాయి. గతేడాది కంటే ఈ సారి రెండు పెళ్లిళ్లు తక్కువే జరిగాయి.

నేడు కైలాసగిరి ప్రదక్షిణ

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలకు వీడ్కోలు చెప్పేందుకు స్వామి, అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. కైలాసగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఉభయదారుడుగా గిరిప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది.

ఆర్టీసీకి రూ.55 లక్షల ఆదాయం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రత్యేక బస్సులు నడిపినందుకు గాను ఆర్టీసీకి రూ.55.45 లక్షలు ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ ముని చంద్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల్లో 1.24 లక్షల కిలోమీటర్లు ప్రత్యేక బస్సులు భక్తులకు సేవలందించాయని చెప్పారు. గత ఏడాది 1.04 లక్షలు ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆద్యుడు 'బికే బసు'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

భారతదేశంలో ఆధునిక ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆధ్యుడు బికే బసు అని ఆయన త్యాగనిరతి, ఆదర్శం కారణంగా తమలాంటి వాళ్ళు ఈ వైద్యంలో కొనసాగుతున్నామని తిరుపతి ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ ఎంఎస్ బాలాజీ అన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ బికే బసు 113వ జయంతి సభను శనివారం యశోద నగర్ లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సభకు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రవీంద్ర అధ్యక్షత వహించారు. సభలో సీనియర్ జర్నలిస్టు రాఘవ, బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి నాగార్జున ప్రసంగించారు. డాక్టర్ బికే బసు 40 ఏళ్ల వయసులోనే చైనా విప్లవంలో గాయాల పాలవుతున్న సైనికులకు సేవలు

అందించటానికి డాక్టర్ నార్మన్ బెతూన్, డాక్టర్ కోట్నిస్ వంటి మరికొందరు డాక్టర్లతో కలిసి చైనా సైనికులకు సేవలందించడానికి వెళ్లారని వక్తలు గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో తిరుపతిలో ఆక్యుపంక్చర్ వైద్యాన్ని కొనసాగిస్తున్నామని, వేమన విజ్ఞాన కేంద్రంలో ఆయన పేరిట ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని, ప్రస్తుతం వారానికి ఒకరోజు శిబిరం కొనసాగుతోందని వివరించారు.

'తండా'ల్లో తాగునీటికి తంటాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు
రెండు నెలలైనా అధికారుల నిర్లక్ష్యం
పైపుల్లేక నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్
రెండేళ్లుగా పనిచేయని బోర్లు
పొలాల నుంచి రెండు కిలోమీటర్ల మోత

ప్రజాశక్తి - కెవిబిపురం

దళితవాడలన్నా, తండాలన్నీ అధికార యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకూ చులకనే.. మీటింగుల్లో చెప్పే మాటలన్నీ వారికోసమే అన్నట్లుగా మాట్లాడతారు.. తీరా మౌలిక వసతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యాన్ని కలిగి ఉంటారు.. రెండు నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైతే అధికారులు, పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో దీన్నిబట్టి అర్థమవుతుంది. పొలాల నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం తాగునీరు మోసుకుని పోవాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతుండడంతో కెవిబిపురం మండలంలోని మారుమూల ప్రాంతమైన కల్లూరు గ్రామస్తుల తాగునీటి అవస్థలు వర్ణనాతీతం.

కల్లూరు గ్రామంలో 180 కుటుంబాలు ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురై రెండు నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. వీరంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు. ఉదయం నిద్రలేచి పనులు పూర్తి చేసుకుని కూలి పనులకు వెళ్లి సాయంత్రం గూటికిచేరుకుంటారు. ఇంటికి వస్తే తాగడానికి గుక్కెడు నీరు ఉండదు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ పొలాల నుంచి వీరు తాగునీరు తెచ్చుకోవడం గమనార్హం.

కొత్తూరు గ్రామంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. పైపులు అమర్చడం మరిచారు. విద్యుత్ మోటారు నీరు అవసరాలకు వాడుకోవడానికి తప్ప దాహం తీర్చుకోడానికి ఒక్కచుక్క కూడా పనికిరాదు. ప్రజల దాహం తీర్చడానికి దాదాపు ఆరు బోర్లు ఉన్నప్పటికీ వాటిలో ఒక్క చేతి బోరు తప్ప, మిగతా ఐదు బోర్లు మరమ్మతుకు గురై రెండేళ్లయ్యింది. దీంతో తాగునీటి కోసం రెండు కిలోమీటర్ల దూరంలోని పొలాలకు వెళుతున్నారు. రెండేళ్లుగా అనేకమార్లు అధికారులకు తమ గోడు వినిపిస్తున్నా ఏ అధికారీ పట్టించుకున్న పాపాన పోలేదన్నది వారి ఆవేదన. ఇకనైనా పాలకులు స్పందించి కొత్తూరు గ్రామస్తుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పొలాల వద్దకు వెళ్లాల్సిందే : కన్నయ్య, గ్రామస్తుడు

తాగునీటి బోర్లు మరమ్మతుకు గురికావడంతో నీటి కోసం మహిళలు, పిల్లలు, పెద్దలు ఆమడదూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తాగునీటి బోర్లకు మరమ్మతులు చేస్తే మా దాహార్తి తీరుతుంది. లేదంటే మండు వేసవిలో మా తిప్పలు అన్నీఇన్నీ కావు.

అధికారులకు చెప్పినా పట్టించుకోరు : శోభన్‌బాబు, గ్రామస్తుడు

తాగునీటి మోటారుకు సప్లై చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండు నెలలయ్యింది. ఈ విషయాన్ని పంచాయతీ, విద్యుత్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. గ్రామంలోని మహిళలు తాగడానికి నీరు తెచ్చుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరం నుంచి బిందెలు మోసుకుని రావాల్సిందే. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

ప్రజాదృష్టి

విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదంటూనే...

'పీక్' అవర్ 'బాదుడు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కరెంట్ నిత్యావసరాల్లో ఒకటైపోయింది. కరెంటే కాదు... కరెంటోళ్లన్న సామన్యుడికి భయమే. ఎప్పుడు ఏది పెంచుతారో తెలియదు. ఎలా వసూళ్లు చేస్తారో తెలియదు. బిల్లును చూస్తే వినియోగదారులకు షాకే. అదేంటంటే ప్రభుత్వం ఆదేశాలని చెప్పడం పరిపాటే. కరెంట్ చార్జీలు పెంచడం లేదంటూనే ఏపిఈఆర్‌సి లోలోపల వినియోగదారుడి జేబుకు చిల్లు పెట్టేలా వ్యవహరించడం గమనార్హం.

విద్యుత్ సంస్కరణల అమల్లో మరో కీలక అడుగు పడింది. చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులు ఖాళీ చేసే మరో విన్యాసానికి రాష్ట్ర సర్కారు తెరదీసింది. తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో వినియోగదారుడిపై 'పీక్ అవర్' పేరుతో చార్జీల కత్తి పెట్టడం. డిమాండును బట్టి చార్జీలను వసూళ్లు చేసే విధానాన్ని అమలు చేస్తున్నారు. సాధారణంగా వినియోగదారుడు ఎంత విద్యుత్ వినియోగిస్తే దానికి యూనిట్‌కు ఇంత అని పద్ధతితో విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. ఇటీవల కాలంలో సంస్థ నష్టాల్లో ఉందని చెబుతూ దాన్ని అధిగమించేందుకు వివిధ పేరులతో అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారు. ఎనర్జీ చార్జీ, కస్టమర్ చార్జీ, సర్ చార్జీ, అడ్జస్టుమెంట్ చార్జీ, ఇతర చార్జీలు అంటూ రకరకాల పేరుతో విద్యుత్ వినియోగానికి మించి బిల్లులు వసూల్లు చేసేవారు. ఇది చాలదన్నట్టు ఇటీవల ఏపిఈఆర్‌సి పీక్ అవర్, ఆఫ్ పీక్ అవర్ పేరుతో వినియోగదారుల నడ్డి విరిచేందుకు అనుమతి ఇవ్వడం గమనార్హం. గతంలో ఇవి బడా పరిశ్రమలకు మాత్రమే ఉండేది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి స్వల్ప లోడ్ (ఎల్‌టి) పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు ఈ పద్ధతిలో నూతన చార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. దీని ప్రకారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు పీక్ అవర్‌గా, ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆఫ్ పీక్ అవర్‌గా నిర్ణయించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు సాదారణ అవర్‌గా పరిగణించి చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీన్ని బట్టి వినియోగం ఎక్కువ ఉండే సమయంలో యూనిట్ ధరకంటే అధికంగా వసూళు చేసేలా నిర్ణయించారు. ప్రస్తుతం ఎల్‌టి వినియోగదారుల నుంచి 50 యూనిట్లలోపు వినియోగించే వారికి యూనిట్‌కు రూ.5.40, 51-100 యూనిట్ల లోపు రూ.7.65, 101నుంచి 300 మధ్యయూనిట్‌కు రూ.9.05, 301-500 మధ్య యూనిట్‌కు రూ.9.60, ఆ పైన వినియోగించే వారికి రూ.10.15 పైసలు చొప్పున వసూల్లు చేస్తున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి పీక్ అవర్, ఆప్‌పీక్ అవర్ చార్జీలను అమల్లోకి తీసుకోరానున్నారు. అసలే వేసవి, అందునే పీక్ అవరల్లో వినియోగం అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితులను డిస్కం సంస్థల సద్వినియోగం చేసుకుని, అధిక చార్జీలు వసూళ్లు చేసేందుకు ఏపిఈఆర్‌సి అనుమతి ఇవ్వడం గమనార్హం.ఈ మేరకు తిరుపతి ఏపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏపిఈఆర్‌సి కమిటీ ఈ నెల 20న సమావేశమై కొత్త టారీఫ్‌ను అధికారికంగా ప్రకటించింది. రానున్న వేసవిలో చిన్నచితక వాణిజ్య సంస్థలకూ పీక్ అవర్ అమలు కానుంది. ప్రస్తుతానికి గృహ వినియోగదారులను వదిలిపెట్టినా...రానున్న వేసవిల్లో ఏదో ఒక రూపంలో వారికి కూడా బాదుడు తప్పదన్నది జగమెరిగిన సత్యం. విద్యుత్ ఛార్జీలను నియంత్రించాల్సిన వారే డిస్కంల ప్రతిపాదనలకు సరేననడం శోచనీయం.

లోడు క్రమబద్ధీకరణకు రాయితీ
సిఎండి కె. సంతోష రావు

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్పిడిసిఎల్) పరిధిలో గృహ విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 రాయితీ కల్పిస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్సి) ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఈ యేడాది మార్చి 1వతేదీ నుంచి జూన్ 30వతేదీలోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్నట్లయితే, ఆ అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ రాయితీ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి : సిపిఎం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మోపూరు గిరిజనుల భూ సమస్యపై యానాదుల సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వెంకటగిరి టౌన్, నాగేశ్వర ఫంక్షన్ హాల్లో శనివారం మల్లికార్జున్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మోపూరు గిరిజనులకు భూములు దక్కనివ్వకుండా చర్యలు చేపడుతున్న పారెస్ట్, పోలీస్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనులకు భూములు దక్కేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సిపిఎం పార్టీ గిరిజనులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. డిఆర్ఓ ప్రతాపరెడ్డి గిరిజనులపై ప్రతాపం చూపించడం ఆపాలన్నారు. వందల ఎకరాలు ఆక్రమించుకున్న పెద్దలపై చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. అధికారులు జోక్యం చేసుకొని డిఆర్ఓ ప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల నాలుగో తేదీ మోపూరు గిరిజన కాలనీ సందర్శించి వారికి ధైర్యం చెప్పాలని అఖిలపక్షం తీర్మానం చేసిందని తెలిపారు. ప్రతాప్ రెడ్డి అవినీతి అక్రమాలపై పోరాటం చేయాలని, ఎమ్మెల్యేకి బిటిడిఏ పీవోలను కలిసి వినతి పత్రాలు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య, రైతు కూలీ సంఘం తరఫున వివి రమణయ్య, అంబేద్కర్ ఐక్యవేదిక ఉపాధ్యక్షులు ఉదయ భాస్కర్, వైసిపి కౌన్సిలర్ శంకరయ్య, టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటాచలపతి, బీఎస్పీ కోటయ్య, బిజెపి తరఫున అంకయ్య, ప్రజా సంఘాల ఐక్యవేదిక నుంచి రఫీ, గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మోపూరు ఆదివయ్య తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభించనున్న సీఎం

ప్రజాశక్తి - ఏర్పేడు: ఏర్పేడు మండలం, పంగూరు వద్ద రాక్ మెన్ కంపెనీ తమ అవసరాల నిమిత్తం నూతన హైడ్రోజన్ ప్లాంటును ఏర్పాటు చేశారు. మార్చి 3 తేదీ, సోమవారం ఉదయం 10 గంటలకు సీఎం వర్చువల్ విధానంలో ప్లాంట్ను ప్రారంభిస్తారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడిషనల్ ఎస్పీ (ఎల్ అండ్ ఓ) రవి మనోహరాచారి కంపెనీ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, ఏర్పేడు ఇన్స్పెక్టర్ జయచంద్రలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని కనమనంబేడు పాఠశాల, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయన శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత మహిళ ఉద్యోగోన్నతి అడ్డుకోవడం దారుణం

సమావేశంలో మాట్లాడుతున్న చింతమాకుల పుణ్యమూర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరపాలక సంస్థ జనన, మరణ రిజిస్ట్రేషన్ విభాగంలో అన్ని అర్హతలు ఉన్న కట్టూరు లక్ష్మీదేవి ఓ దళిత మహిళ అని, గత మూడున్నర సంవత్సరాలుగా ఆమెకు పదోన్నతి కల్పించకుండా వివక్ష చూపించడం, పదోన్నతి ఎవ్వరికీ ఇవ్వవద్దని స్థానిక ఎమ్మెల్యే చెప్పారని సాక్షాత్తు కమిషనర్ మౌర్య ప్రజా సంఘాలతో చెప్పడం దారుణమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీదేవి పదోన్నతి కల్పించాలంటే నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరని, ఎమ్మెల్యే ఎవరికీ పదోన్నతులు కల్పించవద్దని చెప్పారని, కౌన్సిల్ ఆమోదం ఉంటేనే పదోన్నతులు ఉంటాయని కమిషనర్ చెప్పడం చూడడం కాదా అని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సెక్రటరీ వెంకటేష్, రెడ్డప్ప, మధు, మంజునాథ్, నలిని పాల్గొన్నారు.

'సివిల్ రైట్స్ డే' కార్యక్రమం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్ద పాలివేడు గ్రామపంచాయతీకి చెందిన మాలబండ యానాది సెంటర్ ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం ఉదయం మండల తహసీల్దార్ ఐ.సుబ్రమణ్యం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, ప్రజలకు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు స్పందించి తగు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మంిల ఆళ్వార్, గ్రామ రెవెన్యూ అధికారి తిరుమలేష్, విలేజ్ సర్వే వంశీకృష్ణ, గ్రామ సేవకుడు అనిల్ కుమార్లు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ చెక్ పోస్ట్ వద్ద శనివారం ఎస్ఐ విశ్వనాథనాయుడు వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన మోటారు వాహన చట్టం నిబంధనలు ఈ నెల 1వ తేదీనుండి అమలులోకి వచ్చాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

రెడ్డెయ్య రాజుకు సత్కారం

రెడ్డయ్యరాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పశ్చిమ చైతన్య పాఠశాల అధినేత డాక్టర్ కొండూరు రెడ్డెయ్య రాజును స్వామి నారాయణ సి బి ఎస్ సి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ శర్మ సత్కరించారు. రెడ్డెయ్య రాజు ఎస్ ఎల్ పి ప్రాక్టికల్ కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డయ్య రాజు తనకు ఈ సర్టిఫికెట్ రావడానికి సహకరించిన స్మైల్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి కళా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, అడ్మిన్ ఏఓ వెంకటేశ్వర రాజు, దేవేంద్ర, అసిస్టెంట్ డైరెక్టర్ పల్లవి, శివాజీ దేగల మహేష్, ఆర్ట్ శిల్పి ఆర్ కె ఆర్, సత్యనారాయణ, ఆముదాల మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మములూజాన్, వీణాపాణి, కల్పన, రవి, నారాయణ, గిరి, నాని, సునీల్, ప్రగతి సేవా సంస్థ ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు పోలిరెడ్డి పెంచలయ్య, డిష్ నాగరాజు, సంధి ముని ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం డి.ఎస్.పి గీతా కుమారి గూడూరు డి.ఎస్పీ కార్యాలయంలో విద్యార్థినులకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, పోలీసు వ్యవస్థలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

మీర్జాన్ బాషా మృతి.. మాజీ మంత్రి రోజా నివాళి

మీర్జాన్ బాషా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వైఎస్ఆర్ మైనారిటీ నాయకులు జాఫర్ భాషా తండ్రి, విశ్రాంత ఉద్యోగి మీర్జాన్ భాషా శనివారం మృతి చెందారు. మాజీ మంత్రి రోజా ఆయన నివాసానికి వెళ్లి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాతీయ రహదారిపై అఘోరీ హల్ చల్

ప్రజాశక్తి - చిల్లకూరు: ఈ మధ్య దేవాలయాల్లో వివాదాస్పదంగా వ్యవహరించిన మహిళా అఘోరీ తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం, బూదనం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై గోవులను తరలిస్తున్న మూడు లారీలను ఆపి ఎటువంటి అనుమతి లేకుండా గోవులను తరలిస్తున్నారంటూ హల్ చల్ చేసింది. రంజాన్ మాసం సందర్భంగా గోవులను వధించేందుకే తీసుకెళ్తున్నారు అంటూ లారీలను ఆపింది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : నగరంలో అనుమతులు లేని భవనాల నిర్మాణాలు జరగకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని 19 వ వార్డు కార్పొరేటర్ ఆరణి సంధ్య, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి న్యూ బాలాజి కాలని, టిటిడి ప్లాట్స్, ఎస్.కే.డి. నగర్, వైకుంఠపురం పార్కు, రాస్ బిల్డింగ్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, భవన నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయం కార్యదర్శులు నిత్యం ఆయా వార్డుల్లో పర్యవేక్షణ చేయాలని అన్నారు. భవన నిర్మాణాల్లో ప్లాన్ లోని నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.లు మహేష్, లలిత ఉన్నారు.తిరుపతిని ప్లాస్టిక్ రహిత నంగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ అన్నమయ్య కూడలి నుంచి దండి మార్చ్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

అపోలోలో బ్రెయిన్‌స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : అపోలో హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్ కు అత్యాధునిక పద్ధతిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ న్యూరో సర్జన్ చెన్నై అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో ఉన్న అపోలో ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్ కు చెన్నై గ్రీమ్స్ రోడ్ లోని అపోలో ఆసుపత్రిలో నూతన టెక్నాలజీతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండె పాడైనప్పుడు గుండెకు ఎలా యాంజియో చేస్తామో, అదేవిధంగా బ్రెయిన్ డెడ్ అయి మెదడులో రక్తం క్లాట్ అయినప్పుడు బ్రెయిన్‌కు యాంజియో చేసి క్లాత్ తొలగించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన 2 నుంచి 24 గంటల లోపల రోగి అపోలో ఆసుపత్రికి రాగలిగితే అధునాతన శస్త్ర చికిత్స ద్వారా 80 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌ను అరికట్టవచ్చని తెలియజేశారు. తల పగలగొట్టి ఆపరేషన్లు చేస్తారు అన్న అపోహలు మాని, సరైన సమయంలో అపోలో ఆసుపత్రికి వస్తే చిన్న హోల్ ద్వారా శస్త్ర చికిత్స చేస్తామన్నారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కార్తికేయన్ న్యూరో సర్జరీ గురించి వివరించారు. ఈసందర్భంగా శస్త్ర చికిత్స విజయవంతంగా చేసుకున్న తన భార్య గురించి నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన శ్రీనివాస్ మాట్లాడుతూ పనిచేస్తూ సడన్ గా తన భార్య స్పృహ తప్పి పడిపోవడంతో దగ్గర్లోని ప్రాథమిక ఆసుపత్రికి తీసుకెళ్తే హైబీపీ వలన కోమాలోకి వెళ్లిందని,త్వరగా కార్పోరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారన్నారు. వెంటనే నెల్లూరు కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వాళ్ళు స్కానింగ్ చేసి తలలో బ్లీడై బబుల్స్ లా ఏర్పడి బ్లాస్ట్ అయిందని తెలిపారు. చికిత్స చేసినప్పటికీ గ్యారెంటీ ఇవ్వలేదని చెప్పడంతో వెంటిలేటర్ అంబులెన్స్ పై హుటాహుటిన చెన్నై గ్రీమ్స్ రోడ్ లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లానన్నారు. డాక్టర్ శ్రీనివాసన్ వైద్య బందం ప్రాణ బిక్ష పెట్టారని ఆనందం వ్యక్తం చేస్తూ వారికి కతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు తన భార్య ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇంట్లోనూ, పొలంలోనూ అన్ని పనులు చేసుకుంటున్నదని పేర్కొన్నారు.

శ్రీసిటీలో షార్ 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఇస్రోకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల ఉత్సుకతను పెంచేందుకు శ్రీసిటీ , శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి) షార్ ఆధ్వర్యంలో శ్రీసిటీలో "స్పేస్ ఆన్ వీల్స్" మొబైల్ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శుక్ర, శని వారాలలో సాగిన రెండు రోజుల ప్రదర్శనలో స్థానిక ఐఐటి కియా విశ్వవిద్యాలయం, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుండి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలను, ఆకర్షణీయ నమూనాలను ప్రదర్శించారు. ఈ అవకాశాన్ని కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్ కు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కతజ్ఞతలు తెలిపారు. షార్ అధికారి కిరణ్ నేతత్వంలోని ఒక బందం, ఇస్రో కు సంబందించిన వివిధ ప్రయోగాలను ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు వివరించారు.

నిరాహార దీక్షకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం పనబాక గ్రామంలో శ్రీ వైష్ణవి డైరీ వద్ద 40 మంది కార్మికులు గత పది రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు సిఐటియు శనివారం మద్దతు తెలియచేసింది. మద్దతు తెలిపిన వారిలో జై భీమ్ శివకవి ముకుంద, గురవయ్య, మణిలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీ లడ్డు ఘటనతో పరిశ్రమను సీజ్ చేయడం దారుణమన్నారు. కార్మికులతో బలవంతంగ టెర్మినేషన్ కాగితాలపై సంతకాలు పెట్టించుకున్న డైరీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ నాయకులు పులి శ్రీకాంత్, సిఐటియు పెళ్ళకూర్ మండల నాయకులు పుట్టయ్య, కార్మికులు విజయ్ భాస్కర్, బలరాం, జగదీష్, గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సైన్స్ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఎస్వీయు రసాయన శాస్త్ర విభాగంలో శనివారం 'శాస్త్రీయ దృక్పథంతో విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు రేవతి సైన్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కృష్ణ సాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు థియరీతో పాటు సంబంధిత ప్రయోగాలు చేసే అవకాశాన్ని కల్పిస్తే ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సి.సురేష్ రెడ్డి, అధ్యాపకులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రొఫెసర్ ఏ. పద్మజ, పరిశోధక విద్యార్థులు, రసాయన శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : నాయుడుపేట మండలం, అన్నమేడు గ్రామంలో, మార్చి 6 తేదీ వరకు తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ మెగా వైద్య శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ సిబ్బందిచే కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్ చేసి, అద్దాలు ఉచితంగా అందిస్తున్నారు. శనివారం ఈ శిబిరంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, ఆనందరెడ్డిలు పాల్గొన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్స్ చిగురువాడ పద్మనాభయ్య, సన్నారెడ్డి విజయ్ మోహన్ రెడ్డిలు కోరారు.

లిఫ్ట్ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి : విష్ణు నివాసంలో పనిచేస్తున్న రాజశేఖర్, శ్రీనివాసులు, హరీష్, అనిల్ కుమార్‌లు లిఫ్టు ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. వీరందరూ విభిన్న ప్రతిభావంతులు. వీరు సక్రమంగా పని చేయలేరని మార్చి ఒకటో తేదీన పనోరమ కంపెనీ తొలగించిందన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక ఆరో వార్డు గాంధీ నగర్, గేట్ పుత్తూరులో శనివారం ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎసిఎస్ ధనపాల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డిఎన్ గణేష్, మున్సిపల్ మైనారిటీ నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్: శనివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు యరమారు హేమ కుమార్ రెడ్డి, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఐండుకూరు శ్రీకాంత్ రెడ్డి, అశోక్, కృష్ణమూర్తి, రాఘయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణవరం మండలం, కళ్యాణపురంలో ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఆ గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో త్రివిక్రమరావు శనివారం మండలంలోని కంచిన పుత్తూరు, కాటూరు పంచాయతీలలో లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని అంజిమేడులో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్ రెడ్డి, మాజీ జడ్పీ టీసీ సభ్యులు పేరం ధనంజయులు నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, పేరం నాగరాజునాయుడు, సూరి నాయుడు, టి.సుధాకరరెడ్డి , చెవిరెడ్డిశివాజీరెడ్డి ,చెవిరెడ్డిగోపాల రెడ్డి , యం ఆర్ ఓ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ , సచివాలయం సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) : చంద్రగిరి మండలం, కందులవారి పల్లి, దోర్నకంబాల పంచాయతీలలోని మల్లయ్యపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక లోటున్నా బాబు ముందుకు

పెన్షన్ పంపిణీ చేస్తున్న మురళీ నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలంలో మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు ఇంటింటికి వెళ్లి సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది జలజ, రాజేంద్ర, నాయకులు కస్తూరయ్య, తిరుమల బాబు, వెంకటాద్రి, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఐదు మందికి శనివారం10 వేల రూపాయల చొప్పున పెన్షన్ అందించారు. పరిసర గ్రామాల్లో డయాలసిస్ పేషెంట్లకు పెన్షన్ అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీపీ బిందు మాధవి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, పూజారి సుబ్రహ్మణ్యం, ఢిల్లీ నాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, పంతల వెంకటేష్ నాయుడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేటి బచావో.. బేటి పడావో

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో కిషోర బాలికలతో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీలో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే రవీంద్రనాథ్, ఆవల సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య, అంగన్వాడి సూపర్వైజర్లు యమున, జ్యోతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం మండల విద్యాశాఖ అధికారి పద్మావతి, తులసిరామ్, ప్రధానోపాధ్యాయులు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, విందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలు బేటి బచావో- బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పివి మల్లికార్జున రావు, పద్మ, సుజాత, మీరమ్మ, లక్ష్మి కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త విభజనపై అవగాహన

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని 12 పంచాయతీలలో గల తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారు చేయడానికి శనివారం ఇంటింటికి తిరగడం జరిగిందని ఈ ఓ పి ఆర్ మాలతి తెలిపారు. చెత్తను సేకరించి వాహనాల ద్వారా, నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్ అందుబాటులోకి తెచ్చి ఎరువు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం, నీరువాయి గ్రామపంచాయతిలో శనివారం ఇంటింటి నుండి చెత్త సేకరణ కార్యక్రమంలో సర్పంచ్ సుఖప్రియ వెంకటేష్, ఈ ఓ ఆర్ పి డి శ్రీదేవి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు తడి, పొడి చెత్తల విభజనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శరవణ, కరివర్దన్, అరుముగం, పారిశుద్ధ కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజలందరూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విస్తరణాధికారి దేవిక సూచించారు. పుత్తూరు రూరల్ మండలం, తడుకు గ్రామపంచాయతీ, వేణుగోపాలపురంలో గ్రామ సర్పంచ్ వెంకటేష్‌ల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్, డీఆర్పీ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఓజిలి : పరిసరాల పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటామని ఎంపీడీవో సిహెచ్ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం, పరిసర గ్రామాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి , పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓపిఆర్డి రేణుకమ్మ ,పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఇంటింటి నుండి చెత్త సేకరణ కార్యక్రమంలో బాగంగా శనివారం పల్లం గ్రామ పంచాయతిలో ఈఓపిఆర్డి రమణకుమార్ పర్యవేక్షణలో పంచాయతి కార్యదర్శి సుధాకర్ తడి, పొడి చెత్త విభజనపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యమంలో సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.

అలిపిరి పాదాల మండపం శ్రీవారి ఆలయంలో బాలాలయం

ప్రజాశక్తి - తిరుమల: అలిపిరి పాదాల మండపంలోని శ్రీవారి ఆలయంలో బాలాలయం కారణంగా 17వ తేది సాయంత్రం వరకు శ్రీవారి దర్శనం అందుబాటులో ఉండదని శనివారం విడుదల చేసిన ప్రకటనలో టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

పశు వైద్య విద్యార్థుల స్టైఫండ్ పెంచండి

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక గంధమనేని శివయ్య భవనంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం పశువైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వెటర్నరీ విద్యార్థులు, ఏపీ రైతు సంఘం నాయకులు, ఏఐఎస్‌ఎఫ్ , ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ, వైయస్సార్ విద్యార్థి విభాగం, ఎన్‌ఎల్‌ఎస్‌ఏ, పిడిఎస్యు , బీసీ విద్యార్థి విభాగం, జయభారత్ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దాదాపు 27 రోజులుగా వెటర్నరీ విద్యార్థులు శాంతియుత ఆందోళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పశు వైద్య విద్యార్థులు నజ్వర్ ఖాన్,పవన్ నాయక్, వరలక్ష్మి, ప్రవీణ,ఏపీ రైతు సంఘం నాయకులు హేమలత, గోవిందస్వామి,గోపాల్ రెడ్డి ,ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై సీఎం ప్రశంస

రేణిగుంట విమానాశ్రయంలో సీఎంతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయానికి శనివారం రాగా సుధీర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

అలిపిరి పాదాల మండపంలో దర్శనాల నిలిపివేత

ప్రజాశక్తి - తిరుమల: అలిపిరి పాదాల మండపంలోని శ్రీవారి ఆలయంలో బాలాలయం నిర్మిస్తున్నందున ఈ నెల 17వ తేది సాయంత్రం వరకు స్వామివారి దర్శనం అందుబాటులో ఉండదని టీటీడీ అధికారులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వికసిత్ భారత్‌లో సైన్స్ పాత్ర కీలకం

సైన్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పరంధామయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వికసిత్ భారత్ సాధనలో సైన్స్ పాత్ర చాలా కీలకమని ప్రొఫెసర్ పరంధామయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యసాధనలో యువత పాత్రను, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని విద్యార్థులకు వివరించారు. ఆ దిశగా భావి శాస్త్రవేత్తలు తయారు కావాలని ఆకాంక్షించారు.

నాటు సారాను ఆపండి

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖా సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నాటు సారా తయారీ, సేవించడం ఆపాలని తిరుపతి ఎక్సైజ్ శాఖా సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరులో శనివారం నాటు సారా నిషేధంపై నవోదయ 2.0 పేరిట అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నాటు సారా తయారీ, సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ 96.48 శాతం పూర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శనివారం ఒక్కరోజులో మార్చి నెల పెన్షన్ల పంపిణీ 96.48 శాతం పూర్తి చేసినట్లు డిఆర్డిఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. కొందరు అందుబాటులో లేరని, తిరుపతి జిల్లా పెన్షన్ల పంపిణీలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

దళితుల శ్మశాన వాటిక ఆక్రమణ తొలగింపు

చిట్టత్తూరు కారేపల్లిలో స్మశాన వాటిక ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం : తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, చిట్టతూరు కాలేపల్లి, చిట్టత్తూరు ఆది ఆంధ్ర వాడకు చెందిన స్మశాన వాటికలో ఆక్రమణలను శనివారం తొలగించారు. ఆర్ సి పురం తహసిల్దార్ వెంకటరమణ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్ బాబుల ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 358/13 సర్వే 00.38 సెంట్లు స్మశాన స్థలాన్ని గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి ఆక్రమించుకోవడంతో దళితవాడ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాఉరు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటరమణ, నరసింహులు, జి రాజశేఖర్, బాబు, కమ్యూనిటీ సర్వేయర్ మణి, వీఆర్‌ఏ బాల, సుబ్రహ్మణ్యం, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. స్మశాన వాటిక చుట్టూ జెసిబి తో ఫ్రెంచ్ ఏర్పాటు ఏర్పాటుచేసి దళితులకు స్మశాన వాటిక సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామానికి చెందిన దళితులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మినీ గురుకులంలో జాతీయ సైన్స్ దినోత్సవం

కార్యక్రమంలో భాగంగా సామూహిక జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణంలోని ఏపీటీడబ్ల్యూఆర్ మినీ గురుకులంలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణ సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సృజనాత్మక ఆలోచనలపై దృష్టి సారించి విద్యార్థులు ఉన్నతస్థాయికి రావాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీకృష్ణ సేవసమితి ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక జన్మదిన కార్యక్రమంలో 8మంది విద్యార్థునుల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియత, ఉపాధ్యాయునులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

యుజిసి జాయింట్ సెక్రెటరీకి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : యుజిసి జాయింట్ సెక్రెటరీ డాక్టర్ అమోల్ అంధారేను ఏబిఆర్ ఎస్ఎం రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఎస్వీయు అధ్యాపకుడు డాక్టర్.ఎన్.బాలసుబ్రమణ్యం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఎస్వీ యూనివర్సిటీలో జరుగుతున్న ఇండియన్ నాలెడ్జ్ సిస్టం అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేపథ్యంలో అతిథి గృహంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానంలోని మార్పులు, చేర్పులపై చర్చించారు.